**''జీవన్! జీవన్"-జీవన్ ఇంటిముందు నిల్చుని పిలిచాడు ఉల్లాస్. జీవన్ భార్య గీత తలుపులు తెరిచింది.**

"జీవన్ వున్నాడామ్మా"

''ఉన్నారన్నయ్యా రండి కూర్చోండి" అని ఆహ్వానించింది గీత.

లోపలికి వెళ్ళి కూర్చున్నాడు ఉల్లాస్. లోపలి గదుల్లోనించి సన్నగా పాట వస్తూ వుంది. ఆ గొంతు జీవన్‌ది జలకాలాడుతున్నట్లున్నాడు. జీవన్ గొప్ప బాత్రూం సింగర్ !

కాసేపు పేపరు చూశాడు ఉల్లాస్. గీత కాఫీతెచ్చి ఇచ్చింది. కమ్మటి వాసనలుగల అమృతపు రుచి కాఫీ తాగేసి అసహనంగా జీవన్ రాకకోసం ఎదురు చూశాడు.

బట్టలేసుకుంటూ జీవన్ వచ్చాడు. మైసూర్ శాండల్ పరిమళం గుబాళించింది.

"హల్లో బ్రదర్. ఎంత సేపయిందీ వచ్చి?"

''ఇప్పుడే''- నవ్వాడు ఉల్లాస్.

"కాఫీ తాగావా?"

"మా చెల్లాయి చేతి కాఫీ తాగటానికి నీ పర్మిషన్ అక్కర్లేదు లేవోయ్."

"ఓ. కే. ఏమిటి విశేషాలూ?"

"విశేషమే వుంది.అందుకే వచ్చాను పని గట్టుకుని."

"చెప్పు. ఓన్లీ ఫైవ్ మినిట్స్ టయిం పర్యూ" నవ్వాడు జీవన్. "అంత త్వరగా ఈ విషయం చెప్పేది కాదు. చేసి చూపించేది. అందుకు నీ సహకారం కావాలి."

"ఇప్పుడా! ప్రొఫెసర్ రమ్మన్నారు. నేను వెళ్ళాలి. సారీ."

ఉల్లాస్ తెల్ల మొహం పెట్టాడు. నిరుత్సాహంతో కుంగిపోయాడు.

* * *

ఇండియా కాఫీ హవుస్‌లో కాఫీ తాగుతున్నాడు జీవన్.

"హల్లో" — ఉల్లాస్ వచ్చి పలకరించాడు.

"కమాన్!" జీవన్ ప్రక్కనే వచ్చి కుర్చున్నాడు ఉల్లాస్.

కాఫీలు వచ్చేయి. వేడి వేడి కాఫీ సిప్ చేస్తూ— "ఏవిటీ? కనపడటం లేదూ!" అని అడిగాడు జీవన్ యథాలాపంగా.

"అవును. తీరిక దొరకటం లేదు."గంభీరంగా అన్నాడు ఉల్లాస్.

"అలాగా!?"

"అవును. నువ్వు తీరిక లేకుండా రీసెర్చి వర్కులో మునిగిపోయేవు గదా! మూడేళ్ళలో రావల్సిన డాక్టరేట్‌ని రెండేళ్ళకే కొట్టెయ్యాలని నీ ఆరాటం! అందువలన నువ్వు నావంటి వాళ్ళకి అందటం లేదు. తీరిక దొరక్క."

"దెబ్బకొట్టావు"- నవ్వాడు జీవన్.

ఉల్లాస్ దొంగకోపం నటించాడు.

"ఏవిటి విశేషాలూ?!"

"విశేషాలేవున్నాయి. నీతో చెప్పుకుందామని నీ గురించి తిరుగుతూ వుంటే నీవు ఆకుకు అందకా పోకకు పొందకా వున్నావు గదా!"

"సారీ బ్రదర్. నువ్వన్నట్టు నిజంగానే కష్టపడి పని చేస్తున్నాను. అందుకే నీ వంటి మిత్రులకి ఆశాభంగం కలిగిస్తున్నానేమో! అయాం హెల్ప్‌లెస్ !"

"ఇప్పుడయినా నా గోడు వింటావా?" ఉల్లాస్ దిగులుగా అన్నాడు. "వింటానికి ఎంత సేపు పడుతుంది?" నవ్వాడు జీవన్.

"చాలాసేపు పట్టవచ్చును. అతి ముఖ్యమయిన పర్సనల్ విషయం. సీరియస్ కూడా." జీవన్ టయిం చూసుకున్నాడు. హడావుడి పడ్డాడు.

"మాటలలోపడి మర్చిపోయాను బ్రదర్, పదీ ఇరవయ్యయిదయింది. పదిన్నరకి ప్రొఫెసర్‌తో డిస్కషన్లున్నాయి. వస్తాను" — జీవన్ లేచాడు. "మళ్ళీ కలుద్దాం". పళ్ళు కొరుక్కుంటూ వుండిపోయేడు ఉల్లాస్. జీవన్ వెళ్ళిపోయేడు.

* * *

సినిమా హాలుదగ్గర బాగా రష్‌గా వుంది. ఇసుక వేస్తే రాలనట్టు జనం! ట్రిమ్‌గా తయారయి ఆ ఆవరణలోకి అడుగెట్టాడు ఉల్లాస్.

అవతల లేడీస్ కవుంటరుదగ్గర మెరుపు మెరిసింది. సన్నగా ఈలవేశాడు. 'గుడ్ గాడ్. ట్రెమెండస్ బ్లెసింగ్స్‌పాన్ మీ థాంక్యూ'- పదేపదే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. అతను ఆనందతరంగిత మనస్కుడయ్యాడు.

మైమరిచి ఆవైపే చూస్తున్న ఉల్లాస్ భుజంమీద చెయ్యి పడింది. వెనుదిరిగిచూసి "హలో! ప్లెజంట్ సర్‌ప్రయిజ్! శ్రీమాన్ జీవన్‌గారు సినిమాకి రావటమా? ఇది నీకు పుట్టిన బుద్దేనా?" అన్నాడు ఉల్లాస్. వేళాకోళంగా.

జీవన్ నవ్వాడు.

"నాకు పుట్టిన బుద్ధికాదులే. మీ చెల్లాయికి ఆ బుద్ధి పుట్టి బలవంతాన నన్ను లాక్కొని వచ్చింది. అదీ సంగతి" అన్నాడు.

"మంచి పనే చేసింది. నీ తిక్క కుదిర్చింది"-కసిగా అన్నాడు ఉల్లాస్.

జీవన్ నవ్వుతున్నాడు.


"ఇప్పుడైనా నా కోసం ఒక్క నిముషం స్పేర్ చేయగలవా?"—ఉల్లాస్ అర్థించాడు.

"బాగా రష్‌గా వున్నట్లుంది." ఆందోళనగా అన్నాడు జీవన్.

"దయచేసి నామాట విను—ఒకే ఒక్క సారి యువర్ ఎటెన్షన్ ప్లీజ్."

"అలాగే. కాని — మనకు టిక్కెట్లు దొరుకుతాయంటావా?"

"బ్లడీ టికెట్స్. అరక్షణంలో తెస్తాను.



ప్రొప్రయిటరు మనవాడే.కాని నువ్వుదాలా నిర్దయగా నా మాటలని ఆ రెండో చెవు లోంచి వదిలేస్తున్నావు."

"కాదులే. నో ప్రాబ్లంగదా! ఇక చెప్పు. సినిమా చూపించకపోతే గీతా డియర్ నా ప్రాణం తోడేస్తుంది. రేపట్నుంచీ ఇంటెన్సివ్ ప్రాక్టికల్ వర్కుంది. అందు వలన నాకు సినిమాకి రావటం కుదరదు. అందువలన—"

"అబ్బబ్బ! చంపేస్తున్నావుగదరా, జీవన్" కసిగా అన్నాడు వుల్లాస్.

"లేదులే! చెప్పు. చెప్పు వింటున్నాను గదా."

"పెద్ద విశేషమే వుంది. బయటికి రా. మాట్లాడుకుందాం."

"ఇప్పుడా!!"

"ఇప్పుడే ఈ క్షణమే. అర్జంటు!"

"సారీ."

"షటప్"

హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. సన్నగా పాశ్చాత్య సంగీతం వినబడుతూ



# చేదుమందు

## పాలడుగు వెంకటేశ్వరరావు

"ఏమిటి చెప్పేది! ఆ రాస్కెల్ లోప లికి వెళ్ళిపోయింది ఎంత పొగరూ!"

"ఎవర్రా ఆ పొగరుబోతు రాస్కెలూ!!"

"ఎవరా! నా బొంద! నా మనూని మశానమూను. నీకు ఇప్పుడయినా తనని చూపిద్దామనుకున్నాను. కాని చూపించలేక పోయాను. అయాం అన్ లక్కీ!" "సారీ!"

* * *

లైబ్రరీలో రిఫరెన్సు పుస్తకాలు తీసి నోట్సు రాసుకుంటున్నాడు జీవన్ దీక్షగా. గబగబా వచ్చి అతనిప్రక్కన కూలబడ్డాడు ఉల్లాస్ ఆందోళనగా.అతని ముఖాన చెమట పట్టి వుంది. అతను క్రుంగిపోయివున్నాడు. ఉద్రేకంతో వేగంగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీస్తున్నాడు ఉల్లాస్.

నిముషం గడిచింది.

అయిదు నిమిషా లయాయి.

సమాధిలో బడిన యోగిలాగ జీవన్ తల ఎత్తలేదు.

"మిస్టర్"- గుసగుసలాడాడు ఉల్లాస్. తలెత్తి చూసి నవ్వాడు జీవన్. అతన్ని గుర్తించి. "నువ్వా? ఏమిటి విశేషాలు?"

"ఈ పూట 'ఇది' పూర్తిచేయకపోతే మొత్తం శ్రమ వృధా అవుతుంది. ప్రొఫెసర్ ఫస్ట్ వీక్‌లో స్టేట్సు వెళ్తున్నాడు. మళ్ళా ఆర్నెల్లదాకా రాడు. అందువలన వారంరోజుల్లో ఈ పని పూర్తిచేసి సబ్మిట్ చేయకపోతే-సంవత్సరం వెనక్కిపోతుంది. టయిమీజ్ప్రెషస.''

''అలాగే తగలబడు. నేను పోతాను.''

విసురుగా లేచిపోయాడు ఉల్లాస్.

జీవన్ ఒక్కక్షణం. తెల్లబోయి చూసి. వెంటనే తన పనిలో కూరుకునిపోయాడు.

* * *

"ఇవి కేవలం కొన్ని దృష్టాంతాలు మాత్రమే!. ఇలా ఎన్నో అడ్డంకులు! —అలాగ ప్రతీసారీ నిరాశే ఎదురయింది. ఎదురు దెబ్బలూ తగిలాయి." ఆగాడు ఉల్లాస్. సంజయ్ గ్లాసు ఖాళీచేశాడు. తాపీగా చికెన్ పీస్‌ని కొరుకుతూ పరీక్షగా ఉల్లాస్ వంక చూశాడు. ఆ చూపుల్లో నైశిత్యం వుంది.

లైటింగ్ జమ్‌గా వుంది. బేరర్లు

వుంది. కస్టమర్సుతో బార్ రష్‌గా వుంది. ఉల్లాస్ బేరర్‌ని పిలిచాడు. హాఫ్ మెక్డొవెల్. చికెన్ఫ్రై. గ్రీన్‌పీస్. చిప్సు ఆర్డరు చేశాడు.

"ఆయా సందర్భాలలో ఏ ఒక్కసారన్నా 'జీవన్'గాడు నా కష్టాన్ని ఆలకించి నాకు సరిఅయిన డైరెక్షన్ ఇచ్చివుంటే — నే నిలా ఫెయిలవకపోదును." నిట్టూర్చి అన్నాడు ఉల్లాస్— మొహం నిండా దిగులుతో.

"ఎవరన్నారు నువు ఫెయిలయావని?

నువు గెల్చావు మిస్టర్!" గంభీరంగా అన్నాడు సంజయ్.

"గెల్చానా?! సవితవల్ల అంత పరాభవం పొందీ నేను గెలిచానంటావా?"

"అవును."

"ఎలాగ?!"

"చెబుతాను" సాలోచనగా సిగరెట్ పొగ వదిలాడు సంజయ్.

డ్రింక్ వచ్చింది. బాటిల్ ఓపెన్ చేసి గ్లాసులు నింపాడు ఉల్లాస్. పొగలు కక్కుతూ చికెన్ ఫ్రై వచ్చింది. గోల్డుఫ్లేక్ ఫిల్టర్‌కింగ్ సిగరెట్ వెలిగించాడు సంజయ్ మళ్ళీ.


"ఆ అమ్మాయి పేరు ఏమిటన్నావు?"

"సవిత. ఎం.ఏ ఫస్టియర్. ఈ ఏడే యూనివర్సిటీలో చేరింది."

"గుడ్. నువ్వు సవితని లవ్ చేశావ్. అంత వరకూ బాగానే వుంది. కాని ఆ అమ్మాయికి నీ మీద ఎటువంటి అభిప్రాయం వుందో తెలుసుకోవాలన్న ఇది నీకు లేకపోయింది. ఆ కారణంగా నీవు తొందరపడ్డావ్ అనాలి. రాంగ్ ఎప్రోచ్. అందుకే బెడిసికొట్టింది. అది పరాభవంగా అన్పించింది నీకు. ప్రతీకారం తీర్చుకోవాలని ప్లాన్ వేశావు. అందుకు జీవన్ బలమయిన చేతులు కావల్సి వచ్చాయి. అందుకే అతని చుట్టూ కాకిలాగ తిరిగావు. వాడు థీసిస్ సబ్మిట్ చేసే హడావుడిలో అది కుదరలేదు. సరే అది సబ్మిట్ చెయ్యటం అయింది. జీవన్‌గాడు నీకు అందాడు. ఆ తర్వాత ఏమయింది?"

ఒక్క గుటకలో గ్లాసు ఖాళీ చేశాడు ఉల్లాస్.

విచారంగా సిగరెట్ వెలిగించి చెప్పటం సాగించాడు.



## నాలుగు తమాషా కేసులు

ఇటీవల పూనే కోర్టులకు విచిత్రమైన కేసులు వచ్చాయి. రైలులో తప్పిపోయిన శ్రీకాంత్ అనే ఎనిమిదేళ్ళ బాలుడు మా అబ్బాయంటే మా అబ్బాయి అని అదే శరీర వర్ణంతో వయసుతో తమ పిల్లలు కిడ్నాప్ చేయబడినట్టు నాల్గు కుటుంబాల వారు కోర్టుకు ఎక్కారు. ప్రభాత్ సర్కస్‌ను ఒక వూరి నుంచి మరొక వూరికి తరలిస్తున్న సందర్భంలో ట్రక్కు మూలంగా ఏనుగు కాలుకు కొద్దిపాటి గాయం తగిలినందుకు నష్టపరిహారం కోరుతూ సర్కస్ యజమాన్యం కోర్టుకెళ్ళారు. తన జుట్టు చాలా పొడవుగా వున్నదని. దాని పోషణకు, శుభ్రతకు. ఖర్చు ఎక్కువ అవుతోందని తన అత్తమామలు వేధిస్తున్నారంటూ ఒక కోడలుపిల్ల కోర్టుకెక్కింది. ఇవన్నీ కాక తన ఒకటవ ఏట తన తండ్రే తనను ఒక నది ఒడ్డున వదిలి వెళ్ళిపోయాడని. అప్పటి నుంచి తాను ఒకరి దయా ధర్మాలమీద పెరిగి పెద్దవాడిని అయ్యానని అంటూ నలభై సంవత్సరాలు కల ఒక వ్యక్తి తన తండ్రి బాధ్యతారహిత ప్రవర్తనను ప్రశ్నిస్తూ దావా వేశాడు.

తమాషా ఏమిటంటే ఈ మొత్తం నాలుగు విచిత్రమైన కేసులకు న్యాయవాది ఒక్కరే-విశ్వనాథ్‌పాయ్. ఆయన పూనేలో ఇప్పుడు గొప్పపేరు తెచ్చుకున్నాడు. ఇటువంటి కొన్ని ప్రత్యేకమైన కేసులకు కొద్ది మొత్తాన్నే వసూలు చేస్తానని కూడా ఆయన అంటున్నాడు. ●

—"నాకథంతా సావధానంగా విన్నాడు జీవన్. నేను ఏం చేయదల్చుకుంటున్నానో అడిగి తెల్సుకున్నాడు. నా పథకం వివరాలన్నీ అర్థం చేసుకున్నాడు.... చేసుకుని—

* * *

"సరే. నీ యెడల అంత ఘోరంగా ప్రవర్తించిన ఆ సవిత మీద ప్రతీకారం ఇలా తీర్చుకుంటానంటావు!" అన్నాడు గంభీరంగా ఆలోచిస్తూ జీవన్.


"అవును. లేకపోతే నాకు మనశ్శాంతి లేదు." అన్నాను అశాంతిగా.

"నీ పరిస్థితి నాకు అర్థమయిందిరా. ఆ పరిస్థితి అటువంటిదే ననుకో. కాని ఆ రకంగా నువ్వు బలవంతాన నలుగురిలో ముద్దుపెట్టుకున్న తర్వాత ఆ అమ్మాయి ఏమవుతుందన్న సంగతి ఆలోచించావా?" అన్నాడు. "నా నిర్ణయం మారదు. అన్నీ ఆలోచించే అలా నిశ్చయించాను" అన్నాను దృఢంగా.

"పోనీ— నువ్వు నీ గురించన్నా ఆలోచించావా? యూనివర్సిటీ నుంచి నువ్వు డిబార్ అవుతావు. నువ్వు గొప్ప ఇంజనీరువి కావాలని కలలు కంటున్న నీ తల్లిదండ్రులూ—అత్తమామలూ—నీ పరిస్థితికి క్రుంగిపోతారు. ఉజ్వలమయిన నీ భవిష్యత్తు నాశనమయినందుకు మేమందరమూ విచారించాలి."

"ఎవరేమయిపోయినా సరే—నేను లెక్క చెయ్యను" దృఢంగా అన్నాను.

"సరే. నువ్వు ఆవేశంలో వున్నావు. ఉద్రేకం మనిషిని ఆలోచించనీయదుగదా. నీ ఇష్ట ప్రకారమే కానీ. ముందు ఆ అమ్మా



యిని నాకు చూపించు."అన్నాడు. అతన్ని తీసుకుని-లవర్సు కార్నర్ ప్రక్కగా-జే. వీ.డీ. కాలేజీ కాంపౌండు లోపలికి తీసుకుని వెళ్ళాను. సాయం సమయం.

కెమిస్ట్రీ లాబ్ బయట నుంచుని చెలి కత్తెతో సంభాషిస్తోంది.

"అదుగో చూడు" అన్నాను ఆమెని జీవన్‌కు చూపించి.

"చూస్తున్నాను" అన్నాడు జీవన్ సాలో చనగా.

"ఆ ఎర్రటి వంటిమీద ఎర్రచీర కట్టుకున్నమ్మాయే. నన్నెటి సుందరి."

"ఎర్రచీరా. నీలం చీరా?"

"ఎర్ర చీరే!"

"ఆర్యూ షూర్?"

"యెస్!" అన్నాను.

జీవన్- "చంపావుగదరా రాస్కెల్." అనరిచి విరుచుకు పడ్డాడు నామీద. తెల్ల బోయాను.

"నువ్వుగాని ఆ అమ్మాయి జోలికిపోయినట్టు తెలిసిందో- ఎముకలు విరిచి పారేస్తాను! నీ ప్రాణంతీసి మూటగట్టి బంగాళా ఖాతంలో పడేసి నీ ఎడ్రసులేకుండాచేస్తాను డర్టీ రాస్కెల్"అంటూ చడామడా తిట్టాడు.

"అదేవిట్రా ?!" అన్నాను బాధపడ్తూ.

"ఆ అమ్మాయి ఎవరనుకున్నావురా? రాస్కెల్."

"ఎవరూ?"

—"నా చెల్లెలురా అయినా నీకిదేంపోయే కాలం ?! శుభ్రంగా పెద్దలు కుదిర్చిన ఒక అమ్మాయిని పెళ్ళిచేసుకున్నావు. రెండేళ్ళు పోతే వుద్యోగం చేసుకుంటూ సంసారం పెట్టి పిల్లల్ని కనాల్సిన వాడివి. నీకు ఇటువంటి బుద్ధులు పుట్టినయ్యంటే నీ మిత్రుడ్నని చెప్పుకోవటానికి నాకు అవమానంగా వుంది"-అంటూ తోసేసి. నన్ను తీవ్రంగా హెచ్చరించి వెళ్ళిపోయాడు జీవన్" అని నిట్టూర్చాడు ఉల్లాస్-

* * *

"నీ కథలో మరింకా మిగిలిందేమిటి?"-నవ్వి—సీసాలోంచి డ్రింక్‌ని గ్లాసులోకి వంపుకున్నాడు సంజయ్.

ఉల్లాస్ కూడా నవ్వాడు. "అక్కడితో నా కళ్ళు తెరిపిన పడి ఆ జబ్బు వదిలిపోయిందనుకో. కానీ కొన్ని సందేహాలు మిగిలిపోయాయిరా" అన్నాడు.

"ఏమిటవి?"-బిజినెస్ లైక్‌గా అడిగాడు సంజయ్.

"నువ్వూ. వుల్లాస్ ఒకూరివాళ్ళు గదా. అందువలన ఆ సంగతి నాకంటే నీకే బాగా తెలియాలి ఆ నమ్మకకు నాచేత ఇలాగ అడిగిస్తూ వుంది."


"ఏ సంగతి?"

"నిజంగా సరిత జీవన్‌గాడి చెల్లెలేనా?- అని."

"కాదు."

పిడుగు పడినట్లు వులిక్కిపడ్డాడు ఉల్లాస్. అవమానంతో. విచారంతో తల వంచుకున్నాడు.

"మరి- మరి- జీవన్ అలాగ ఎందుకనాల్సివచ్చిందీ?"




సంజయ్ నవ్వాడు. "ఇక్కడ రెండు పాయింట్లున్నాయి. జాగ్రత్తగా విను. ఒకటి- నీతిగల మగాడికి. కన్నతల్లి. కట్టుకున్న భార్యాగాక ఈ ప్రపంచంలో ప్రతి స్త్రీ కూడా అప్ప-చెల్లెలుతోనే సమానం. రెండవది: జీవన్ నీకు ఎంత ప్రాణ మిత్రుడయినా నీతి తప్పిన నువ్వు తలపెట్టిన ఆ పని అన్యాయమని గ్రహించాడు. ఇంత చదువులూ చదువుతూ దేశాన్ని వుద్ధరించవలసిన మనమే ఇలా జంతువుల్లాగ ప్రవర్తించటాన్ని జీవన్ సహించలేకపోయాడు. దారి తప్పుతూన్న నిన్ను రక్షించటానికే అతను ఆ అబద్ధం ఆడివుంటాడు. మందు చేదుగానే వున్నా స్వస్థత పొందడానికి రోగి దాన్ని మింగక తప్పదు మిస్టర్—ఏవంటావు?"

ఉల్లాస్ తల క్రిందకీ పైకీ వూపాడు. కళ్ళ అంచుల్లో నీటి పొరలు. "అందువల్లే నువు తిరిగి దారికొచ్చావు!"

"జీవన్ గొప్పవ్యక్తి.రేపే వెళ్ళి అతన్ని క్షమాపణ కోరు. అప్పుడు గాని నీ మనసు తేలికపడదు. పశ్చాత్తాపం మనసులోని కల్మషాన్ని కడిగేయగల వీలు వుంది. ఆ పని జరిగింది గనుక నేనన్నాను. గెలుపు నీదేనని. కాదా?" ఉల్లాస్ అంగీకారంగా తల వూపాడు.

బేరర్‌కి బిల్లు చెల్లించి- సంజయ్ వెనకే బయటికి దారి తీశాడు ఉల్లాస్. అతని మనసు తేలికయింది. ◉

# మందార మకరందాలు

## జందెప్పోగైనా అడ్డమేనేమో

ఎంకి నాయుడు బావ కోసం "ఆనాటి నావోడు" అని కలవరిస్తోందంటే-అది నిజమేనా అంటే నిజమేనేమో. ఆఁ ఉత్తి ఊహ-అంటే పోనీ ఊహే.

నాయుడు బావ గాలికైనా తాను కౌగిలీనన్నాడు అంటుంది. అంటే ఆవిడ ఉద్దేశ్యం వారి కౌగిలింతలో గాలైనా. గాలి పొరైనా అడ్డం ఉండడాన్ని అతడు సహించడన్న మాట. ఆ విశేషాన్ని ఎంకి ఎంతో గొప్పగా జ్ఞాపకం చేసుకుంటోంది.

సఖి నవనిధువన సమయే (రే) అంకపాళీ సఖ్యాని బిడయా
హారోనివారిత ఏవోచ్ఛిద్యమాణ స్తతఃకథం రమితం?

ఎంకిలాంటి ఒక అమ్మాయి మరొక చెలికత్తె దగ్గిర తమ గాఢ పరిష్వంగ విశేషాన్ని సగర్వంగా చెప్పుకుంది. ఆ స్నేహితురాలు ఎంకిని ఇలా ఎగతాళిపట్టించింది.

దట్టమైన కౌగిలి (అంకపాళి స్త్రీలింగం కనక) అనే అమ్మాయి ఆ నూతన సమాగమ సమరంలో ఎగుదుగా (అడ్డుగా) వున్న హారాన్ని తప్పించి పడేసింది. నిజమే—అయితే ఆ (అంకపాళి) కౌగిలి అనే అమ్మాయి అక్కడే వుందిగా — మీరు సంగమించడం ఎలా సాధ్యమయింది?

—పాఠరి